ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 194 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

మంగళవారం 18 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

50 మంది సినీతారలు, పారిశ్రామికవేత్తలు..
దిల్లీ సీఎం ప్రమాణానికి భారీగా ఏర్పాట్లు

దిల్లీ సీఎం ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పలువురు సినీ సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు ఈ కార్యక్రమానికి రానున్నారట..!

దిల్లీ, ఫిబ్రవరి 18, (రిపబ్లిక్ న్యూస్): 26 ఏళ్ల కలను సాకారం చేసుకుంటూ దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది భారతీయ జనతా పార్టీ. త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ఇన్నేళ్ల తర్వాత అధికారంలోకి వస్తుండటంతో నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సినీ తారలు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 20న (గురువారం) సాయంత్రం 4.30 గంటలకు కొత్త సీఎం ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారైనట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. ప్రఖ్యాత రామ్జీలా మైదాన్లో జరిగే ఈ వేడుకకు కమలదళం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రమాణస్వీకారానికి ముందు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది.

ఇక, 50 మంది సినీతారలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, కేంద్రమంత్రులు, భాజపా అగ్రనేతలు ఈ మెగా ఈవెంట్కు రానున్నారట. వీరితోపాటు దిల్లీకి చెందిన పలువురు రైతులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులను కూడా ఆహ్వానించినట్లు సమాచారం. బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా బాగేశ్వర్ దీరేంద్రశాస్త్రి వంటి ఆధ్యాత్మిక గురువులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నట్లు భాజపా వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 8న వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో భాజపా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులు అవుతున్నా నూతన ముఖ్యమంత్రి ఎవరనేది ఇంకా తెలియరాలేదు.

మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్వర్మ పేరు సీఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. ఈయన తాజా ఎన్నికల్లో ఆర్ఆర్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ పై విజయం సాధించారు. బుధవారం భాజపా శాసనసభాపక్ష భేటీ జరగనుంది. అందులో కొత్త సీఎంతో పాటు కేబినెట్ మంత్రులను ఎన్నుకోనున్నారు.

సైబర్ నేరాల సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసుల ముందంజ: సీఎం రేవంత్

సైబర్ నేరాలకు పరిష్కారాలను కనుగొనడమే లక్ష్యంగా హెచ్ఐసీసీలో 'షీల్డ్ 2025 సదస్సు జరుగుతోంది.

హైదరాబాద్, ఫిబ్రవరి 18, (రిపబ్లిక్ న్యూస్): సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలకు పరిష్కారాలను కనుగొనడమే లక్ష్యంగా హెచ్ఐసీసీలో నిర్వహించిన 'షీల్డ్ 2025' సదస్సులో ఆయన మాట్లాడారు. "తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం.

సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. గతేడాది సైబర్ నేరాల దర్యాప్తు కోసం కొత్తగా 7 పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో చొరబడి మాత్రమే దోపిడీలు చేసేవారు. ఇప్పుడు దొంగలు ఎక్కడో ఉండి.. మన సొమ్ము దొంగిలిస్తున్నారు. నేరం ఎక్కడి నుంచి ఎవరు చేశారో కనుక్కోవడం పెద్ద సవాలుగా మారింది. నేరాల శైలి మారుతోంది. వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలి " అని అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. "సాంకేతికతతో మరిన్ని అవకాశాలు లభిస్తాయి. అయితే దానితో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్, ర్యాన్సమ్‌వేర్, మాల్వేర్ వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. సైబర్ దాడుల వల్ల ఎన్నో వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఎయిమ్స్పై సైబర్ దాడి జరిగింది. అమెరికాలో జరిగిన సైబర్ దాడితో విమాన రాకపోకలు స్తంభించాయి. సైబర్ నేరాల వల్ల రూ.15 వేల కోట్లను భారత్ నష్టపోతోంది" అని మంత్రి అన్నారు. 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు ఈ కాన్ఫ్లెవ్ హాజరు కావడం ఆనందంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. "సైబర్ నేరాలు యూనివర్సల్ ఛాలెంజ్ మారాయి. వీటిని అరికట్టేందుకు ఈ కానెక్లేవ్ ఒక మంచి వేదిక. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితనానికి కేంద్రం అవార్డులు కూడా ఇచ్చింది. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లు సీజ్ చేస్తాం. రూ.183 కోట్లను 18 వేల మంది బాధితులకు అందించాం" అని వివరించారు.

వైస్ ఛైర్మన్ ఎన్నిక..
తుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

కాకినాడ జిల్లా తుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది.

తుని, ఫిబ్రవరి 18, (రిపబ్లిక్ న్యూస్): కాకినాడ జిల్లా తుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో అక్కడికి చేరుకున్న వైకాపా కౌన్సిలర్లను తెదేపా శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో వారు వెనుదిరిగి మున్సిపల్ ఛైర్పర్సన్ ఇంటికి వెళ్లారు. సోమవారం కోరం లేకపోవడంతో వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది.

ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన నేపథ్యంలో నేడు మరోసారి నిర్వహించనున్నారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అక్కడికి చేరుకున్నారు. తెదేపా శ్రేణులు భారీగా తరలి రావడంతో మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. వైకాపా కౌన్సిలర్లను మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కిడ్నాప్ చేశారని తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు. కౌన్సిలర్లకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం లేదన్నారు. వైకాపా కౌన్సిలర్లలో ఎక్కువ మంది తమకే మద్దతిస్తారని చెబుతున్నారు. మరోవైపు 'చలో తుని'కి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమానికి అనుమతి లేదని హెచ్చరించారు. తుని మున్సిపాలిటీ పరిధిలో సెక్షన్ 163 (2) అమలు చేస్తున్నారు. సభలు, సమావేశాలు, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో అనుచరులతో కారులో తుని వెళ్తున్న వైకాపా నేత ముద్రగడ పద్మనాభరెడ్డి, మాజీ ఎంపీ వంగా గీతను పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపారు. సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి.

ఆ ఆరోపణల్ని నిరూపిస్తే రాజీనామా చేస్తా
: భాజపా ఎమ్మెల్యేలకు దీదీ సవాల్

బంగ్లాదేశ్ ఛాందసవాదులతో తనకు సంబంధం ఉందని నిరూపిస్తే.. తన పదవికి రాజీనామా చేస్తానని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సవాల్ చేశారు.

కోల్‌కతా, ఫిబ్రవరి 18, (రిపబ్లిక్ న్యూస్): పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ వేదికగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ భాజపా ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు. బంగ్లాదేశ్ ఛాందసవాదులతో తనకు సంబంధం ఉందని నిరూపిస్తే.. తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. బంగ్లాదేశ్ ఛాందసవాదులతో చేతులు కలిపారంటూ భాజపా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో దీదీ మాట్లాడుతూ.. భాజపా తీరుపై విరుచుకుపడ్డారు.

"అసెంబ్లీలోమాట్లాడటానికి అనుమతించడంలేదని భాజపా ఎమ్మెల్యేలు దుష్ప్రచారం చేస్తున్నారు. విద్వేషాలను వ్యాప్తి చేయడానికి, ప్రజల్ని విభజించడానికి వారికి వాక్ స్వాతంత్ర్యం అనుమతించడు. భాజపా మతాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోంది. నేను జాతీయ భద్రత లేదా విదేశాంగ విధానం వంటి అంశాల జోలికి వెళ్లను.. కానీ, అమెరికా నుంచి అక్రమవలసదారుల్ని గొలుసులతో బంధించి వెనక్కి పంపించడం సిగ్గుచేటు. వారిని అమెరికా నుంచి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం విమానాలు పంపాలి. భాజపా ఎమ్మెల్యేలు నన్ను ఎదుర్కొనేందుకు భయపడుతున్నారు.. అందుకే నేను సభలో మాట్లాడుతున్నప్పుడు బాయ్కాట్ చేసి వెళ్లిపోతున్నారు" అని ఆక్షేపించారు.

పాపులారిటీ ఉంటే ఏదైనా మాట్లాడతారా..?
యూట్యూబర్ పై సుప్రీంకోర్టు ఆగ్రహం

రణ్వీర్ అల్లాబాదియా వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా ఖండించింది. ఇలాంటి భాష ఎవరికైనా నచ్చుతుందా..? అని ప్రశ్నించింది.

దిల్లీ, ఫిబ్రవరి 18, (రిపబ్లిక్ న్యూస్): 'ఇండియాస్ గాట్ లాటెంట్ కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్వీర్ అల్లాబాదియా పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. పాపులారిటీ ఉంటే ఏదైనా మాట్లాడతారా..? ఇలాంటి భాషను ఎవరైనా ఇష్టపడతారా..? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది.

"ఇదంతా అసభ్యత కాకపోతే ఇంకేంటి..? మీ మెదడులోని చెత్తనంతా ఆ ప్రోగ్రామ్ ద్వారా బయటపెట్టారు. ఇలాంటి ప్రవర్తన ఖండించదగినది. మీరు పాపులర్ అని చెప్పి, ఏదైనా మాట్లాడతా అంటే సమాజం ఆమోదించదు. ఇలాంటి భాషను ఎవరైనా ఇష్టపడతారా..? ఇలాంటి వ్యక్తులకు కోర్టు ఎందుకు రక్షణ కల్పించాలి" అని సుప్రీం ప్రశ్నించింది. రణ్వీరను తీవ్రంగా మందలించిన అసలేం జరిగిందంటే.. ఐజీఎల్ లో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడంతో ప్రముఖ యూట్యూబర్ రణ్ వీర్ అల్లాబాదియాపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సమయ్ రైనా షోలో రణ్వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడిపై పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. వాటిపై ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన ఎఫ్ఐర్లు అన్నింటినీ క్లబ్ చేయాలని ఓ పిటిషన్ లో పేర్కొన్నాడు. దానిపైనే తాజాగా విచారణ జరిగింది. ఇటీవలే సుప్రీంకోర్టు సీజేఐ బాధ్యతల నుంచి రిటైరైన జస్టిస్ డీవై చంద్రచూడ్ కుమారుడు అభినవ్ చంద్రచూడ్.. రణ్వీర్ తరఫున వాదనలు వినిపించారు. నైతిక విలువల ప్రకారం తన క్లైంట్ వ్యాఖ్యలు సమర్థించనని, అయితే అతడిని హత్య చేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని కోర్టుకు వెల్లడించారు. ఆ సమయంలో మహారాష్ట్ర, అస్సాం పోలీసులను ఆశ్రయించవచ్చని కోర్టు సూచించింది. అలాగే సామాజిక మాధ్యమాల్లో అశ్లీల కంటెంట్ను నియంత్రించడానికి ఏవైనా చర్యలు తీసుకొనే యోచనలో ఉన్నారా..? అని ఈసందర్భంగా కేంద్రాన్ని ప్రశ్నించింది. దానిపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది.

స్థానిక ఎన్నికలు వస్తున్నాయనే మళ్లీ
కాంగ్రెస్ నేతల నాటకాలు: కేటీఆర్

కాంగ్రెస్ పాలనతో ఏ వర్గమూ సంతోషంగా లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

ఆమనల్, ఫిబ్రవరి 18, (రిపబ్లిక్ న్యూస్):కాంగ్రెస్ పాలనతో ఏ వర్గమూ సంతోషంగా లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని ఆ పార్టీ నేతలు మళ్లీ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ మోసపోతే ఎవరూ కాపాడలేరన్నారు. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం ఆమనల్లో నిర్వహించిన రైతు మహాధర్నాలో కేటీఆర్ మాట్లాడారు.

"కేసీఆర్ హయాంలో రైతు రాజులా బతికాడు. రేవంత్రెడ్డి సీఎం అయ్యాక సోనియాగాంధీ పుట్టినరోజు రెండుసార్లు వచ్చింది.. కానీ రుణమాఫీ 25 శాతం కూడా కాలేదు. 35 సార్లు దిల్లీ విమానం ఎక్కారు.. 35 పైసలూ తీసుకురాలేదు. అప్పులు కట్టలేదని రైతుల తలుపులు ఎత్తుకెళ్లారు.. రేపో మాపో పుస్తెలతాడు కూడా లాక్కెళ్లిపోతారు. ఓట్ల కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలి. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అని డ్రామాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి తెలియదు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ పాటు సొంత ఊరు, అత్తగారి ఊరు కల్వకుర్తిలో ఏమైనా చేశారా? అని అడగడానికి ఇక్కడకు వచ్చాం. కులగణన పేరుతో బీసీలను రేవంత్రెడ్డి మోసం చేశారు" అని కేటీఆర్ ఆరోపించారు.

మూస పద్ధతులకు స్వస్తి, కేజీ టు పీజీ విద్యలో సమూల మార్పులు: మంత్రి లోకేశ్

ఏపీలో విద్యారంగాన్ని దేశంలోనే నెంబర్ వన్గా తీర్చిదిద్దడమే లక్ష్యమని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

అమరావతి, ఫిబ్రవరి 18, (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో విద్యారంగాన్ని దేశంలోనే నెంబర్ వన్గా తీర్చిదిద్దడమే లక్ష్యమని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అమలు చేస్తోన్న మూస పద్ధతులకు స్వస్తి చెప్పి సృజనాత్మకత పెంపొందించేలా కేజీ టు పీజీ విద్య కరిక్యులమ్లో సమూల మార్పులు తెస్తున్నామన్నారు. కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెనువెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

జాతీయ విద్యావిధానం లక్ష్యసాధనలో భాగంగా రాష్ట్రంలో విద్యానైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఏపీ ప్రభుత్వంతో సింఘానియా గ్రూప్ (రేమండ్స్), ఏపీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, నాణ్యత, ఉపాధ్యాయ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణతో పాటు జాతీయ విద్యావిధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానం వంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురావడం ద్వారా పాఠశాలల నిర్వహణలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఐదేళ్ల వ్యవధిలో అమలుచేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందనుంది. ఆ తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు కూడా ట్రస్ట్ సేవలను విస్తరించనున్నారు. విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యవంతంగా తయారు చేయడమే లక్ష్యమని సింఘానియా గ్రూప్ చైర్మన్ తెలిపారు. విద్యార్థులకు మరింత ప్రభావవంతమైన, ఆకర్షణీయమైన అభ్యసన విధానాల్లో బోధన చేసేందుకు వీలుగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు విజయవాడ, వైజాగ్, అమరావతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాఠ్యాంశాల్లో సాంకేతికతను మెరుగుపరచడం, ఆంగ్లంలో విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలను బలోపేతం చేయడం ద్వారా విద్య నాణ్యతను పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.

బంద్‌కు మావోయిస్టులు పిలుపు..
తెలంగాణ- ఛత్తీస్ గఢ్ సరిహద్దులో హైఅలర్ట్

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు.

చర్ల, ఫిబ్రవరి 18, (రిపబ్లిక్ న్యూస్): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు బంద్కు పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలంగాణ- ఛత్తీస్ గఢ్ సరిహద్దులో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. ఎన్కౌంటర్లకు నిరసనగా బీజాపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాల బంద్కు మావోయిస్టులు పిలుపునివ్వడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, పూసుగుప్ప, మారాయిగూడెం అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టాయి.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- క్రీ.పూ.3102: కొందరు పౌరాణికులు, చరిత్రకారుల లెక్క ప్రకారం కలియుగము ప్రారంభమైనది.
- 1911: ఎయిర్‌మెయిల్ సేవ అధికారికంగా బ్రిటీష్ ఇండియా ప్రయోగించిన రోజు. హెన్రీ పెక్వెట్ అనే వైమానికుడు 6,500 ఉత్తరాలను అలహాబాద్ నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న నైనికి బట్వాడా చేశాడు.
- 1486: రాధాకృష్ణ సాంప్రదాయంలో, భక్తి ఉద్యమంలో ముఖ్యునిగా పేరొందిన భక్తుడు చైతన్య మహాప్రభు జననం (మ.1534).
- 1564: ఇటలీ కి చెందిన చిత్రకారుడు, శిల్పి, కవి, ఇంజనీరు మైఖేలాంజెలో మరణం (జ.1475).
- 1745: బ్యాటరీని ఆవిష్కరించిన ఇటలీ శాస్త్రవేత్త అలెస్సాండ్రో వోల్టా జననం (మ.1827).
- 1836: ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస జననం (జ.1886). (చిత్రంలో)
- 1939: సంఘసంస్కర్త భాగ్యరెడ్డివర్మ మరణం (జ.1888).
- 1994: నృత్యకారుడు, నటుడు, నృత్య దర్శకుడు గోపీకృష్ణ మరణం (జ.1933).
- 2015: తెలుగు సినిమా నటుడు, ప్రముఖ నిర్మాత, భారత పార్లమెంటు మాజీ సభ్యుడు దగ్గుబాటి రామానాయుడు మరణం (జ.1936).

కలియుగము

హెన్రీ పెక్వెట్

చైతన్య మహాప్రభు


సదామైఖేలాంజెలో

అలెస్సాండ్రో వోల్టా

రామకృష్ణ పరమహంస

భాగ్యరెడ్డివర్మ

గోపీకృష్ణ

దగ్గుబాటి రామానాయుడు

రిపబ్లిక్ స్పోర్ట్స్

బీసీసీఐ యూటర్‌ను.. ఫ్యామిలీని వెంట తెచ్చుకోవచ్చు కానీ!

కుటుంబసభ్యుల విషయంలో క్రికెటర్లకు కాస్త ఊరటనిచ్చింది బీసీసీఐ. ఛాంపియన్స్ ట్రోఫీకి ఆటగాళ్లు తమ ఫ్యామిలీని వెంట తెచ్చుకోవచ్చని తెలిపింది. అయితే, ఇందుకో షరతు పెట్టినట్లు తెలుస్తోంది.

బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఘోర పరాభవం తర్వాత ఆటగాళ్లు, స్టాఫ్కు సంబంధించి బీసీసీఐ కఠిన నిబంధనలు రూపొందించిన సంగతి తెలిసిందే. ఇకపై క్రికెటర్లు తమ భాగస్వాములు, కుటుంబసభ్యులను వెంట తీసుకెళ్లడం సహా పలు సౌకర్యాల విషయంలో కొన్ని ఆంక్షలు విధించింది. ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని ఇప్పటికే బోర్డు స్పష్టం చేసింది. తాజాగా ఈ 'నో ఫ్యామిలీ రూల్ నుంచి ఆటగాళ్లకు కాస్త ఊరటనిచ్చినట్లు తెలుస్తోంది. దుబాయ్కి ఆటగాళ్లు తమ కుటుంబసభ్యులను వెంట తెచ్చుకోవచ్చని బోర్డు చెప్పిందట. అయితే, ఇందుకో షరతు పెట్టినట్లు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీలో కేవలం ఒకేఒక్క మ్యాచ్కు మాత్రమే ఆటగాళ్ల వెంట కుటుంబసభ్యులను అనుమతిస్తామని బీసీసీఐ చెప్పినట్లు తెలిసింది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఫ్యామిలీని వెంట తెచ్చుకునే విషయం గురించి ఆటగాళ్లందరూ చర్చించుకొని ఆ తర్వాత అభ్యర్థన చేసుకోవాలని బీసీసీఐ చెప్పినట్లు సమాచారం. అందుకు అనుగుణంగా బోర్డు ఏర్పాట్లు చేయనున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. బీసీసీఐ నిర్ణయించిన '10 పాయింట్ల' పాలసీ ప్రకారం.. నెల రోజుల పర్యటన ఉంటేనే ఒక వారం కుటుంబసభ్యులతో ఉండేందుకు వీలుండేది. కానీ, ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న ప్రారంభమై.. మార్చి 9న ముగుస్తుంది. దీంతో ఈ టోర్నీకి క్రికెటర్లు తమ కుటుంబసభ్యులను తీసుకెళ్లేందుకు అనుమతించడం లేదని అంతకుముందు బీసీసీఐ వెల్లడించింది. దీనిపై ఓ సీనియర్ క్రికెటర్ నుంచి వినతి వచ్చినా.. ఎవరికీ మినహాయింపు ఇవ్వలేమని బోర్డు అప్పుడు తేల్చిచెప్పింది. అయితే, ప్రస్తుతం టోర్నీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని.. ఒక్క మ్యాచ్కు మాత్రం ఆటగాళ్లు తమ కుటుంబసభ్యులను వెంట తెచ్చుకునేందుకు అనుమతినిచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఏ మ్యాచ్కు బోర్డు ఈ మినహాయింపు ఇవ్వనుందనే విషయం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. బుధవారం నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. భారత్ ఆడే మ్యాచ్లు తటస్థ వేదిక అయిన దుబాయ్ లో జరగనున్నాయి. ఇప్పటికే టీమ్ ఇండియా బృందం అక్కడికి చేరుకుంది. ఈ టోర్నీలో రోహిత్ సేన ఫిబ్రవరి 20న తన తొలి మ్యాచ్లో లో బంగ్లాదేశ్తో ఆడనుంది. ఫిబ్రవరి 23న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్తో తలపడనుంది.

ఏడాది నుంచి ఓటీటీలో ట్రెండింగ్..
'సలార్' రికార్డుపై స్పందించిన పృథ్వీరాజ్ సుకుమారన్

ప్రభాస్ నటించిన 'సలార్ సినిమా ఓటీటీలో ఏడాది నుంచి ట్రెండింగ్లో ఉంది. తాజాగా దీనిపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'సలార్ పార్ట్-1: సీజ్ ఫైర్ 2023 చివరిలో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకొని కలెక్షన్ల సునామీ సృష్టించింది. గతేడాది ఫిబ్రవరి 16న ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ఈ యాక్షన్ థ్రిల్లర్ అప్పటినుంచి ఇప్పటివరకూ ఓటీటీలో టాప్ 10లో ట్రెండింగ్లో ఉండడం విశేషం. తాజాగా దీనిపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. దీన్ని అసలు ఊహించలేదన్నారు. "365 రోజుల నుంచి ఇప్పటికీ ట్రెండింగ్. అద్భుతమైన థియేటర్ రన్ తర్వాత మా చిత్రం ఓటీటీలోకి అడుగుపెట్టింది. అక్కడ కూడా చరిత్ర సృష్టిస్తోంది. దీన్ని నేనెప్పుడూ ఊహించలేదు. ఇది కేవలం రికార్డు కాదు.. మా ప్రేక్షకుల ప్రేమ, వారి అభిమానానికి నిదర్శనం. ఈ ప్రయాణం నిజంగా మరపురానిదిగా చేసినందుకు అందరికీ ధన్యావాదాలు" అని అన్నారు. మొదట నెటిక్స్ వేదికగా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో 'సలార్' అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత జియో హాట్ స్టార్ వేదికగా హిందీ వెర్షన్ స్ట్రీమింగ్లో కి వచ్చింది. ఇది గతేడాదినుంచి ఇప్పటివరకూ టాప్ 10లో ట్రెండింగ్ అవుతోంది. దీంతో అభిమానులు ఖుష్ అవుతున్నారు. ఎక్స్ వేదికగా టీమ్ను అభినందిస్తూ పోస్టులు పెడుతున్నారు. థియేటర్లలో, ఓటీటీలోనూ సందడి చేసిన ఈ యాక్షన్ థ్రిల్లర్ టీవీ ప్రీమియర్ లోనూ సత్తా చాటిన విషయం తెలిసిందే. దీని హిందీ డబ్బింగ్ వెర్షన్ను ఉత్తరాదిన టీవీలో ప్రదర్శించగా అది మిలియన్లకొద్దీ వ్యూస్ ను సొంతం చేసుకుంది. ఏకంగా 30 మిలియన్ల వ్యూస్ను సాధించి రికార్డు నెలకొల్పింది. 2024లో అత్యధిక వీక్షణలు పొందిన టాప్ 3 చిత్రాల జాబితాలో 'సలార్' నిలిచింది. 'సలార్: పార్ట్-1 సీజ్ ఫైర్ భారీ విజయాన్ని అందుకున్న నేపథ్యంలో దీని రెండో పార్ట్ 'శౌర్యాంగపర్వం'పై ఆసక్తి నెలకొంది. దీంతో ప్రశాంత్ నీల్, ఆయన టీమ్ మొదట అనుకున్న స్క్రిప్టుకు మరిన్ని మెరుగులుదిద్ది 'శౌర్యాంగపర్వం' సిద్ధం చేయనున్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో టీమ్ దీని గురించి మాట్లాడింది.

నా కెరీర్లో ఏదీ ప్లాన్ చేసుకోలేదు: విజయ్ సేతుపతి

తన కెరీర్లో ఏదీ ప్లాన్ చేసుకోలేదని విజయ్ సేతుపతి అన్నారు. అజిత్తో తో కలిసి నటించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చి స్టార్గా ఎదిగారు విజయ్ సేతుపతి. భిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. తాజాగా ఆయన ఓ కాలేజీ ఈవెంట్లో విద్యార్థులతో మాట్లాడారు. వారికి కొన్ని సలహాలిచ్చారు. అలాగే తాను అజిత్తో కలిసి స్క్రీన్ పంచుకోకపోవడం గురించి స్పందించారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని విజయ్ సేతుపతి సూచించారు. "సోషల్ మీడియాలో మీరు చూసే ప్రతిదాన్ని నమ్మొద్దు. ఎందుకంటే మీ మనసును లక్ష్యంగా చేసుకొనే అనవసరమైన కంటెంట్ అందులో చాలా ఉంటుంది. తెలివిగా ఆలోచించి ముందడుగు వేయాలి. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సమయం ఎంతో విలువైనది. అది గడిచిన తర్వాత మాత్రమే దాని విలువను గ్రహిస్తారు. సంతోషంగా జీవితాన్ని గడపండి" అని విద్యార్థులకు వివరించారు. విజయ్ సేతుపతి, అజిత్ కుమార్ కలిసి స్క్రీన్పై కనిపించాలని చాలామంది అభిమానులు కోరుకుంటున్నారు. ఈవిషయంపై విజయ్ మాట్లాడుతూ.. "గతంలో అజిత్తో కలిసి వర్క్ చేసే అవకాశం వచ్చింది. కానీ, కొన్ని కారణాల వల్ల ఆ సినిమాలు పట్టాలెక్కలేదు. అజిత్ గొప్ప నటుడు, మంచి వ్యక్తి. ఆయనతో కలిసి పనిచేసే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను. నా కెరీర్ లో ఏదీ ప్లాన్ చేసుకోలేదు. వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకుసాగుతున్నా" అని తెలిపారు. గతేడాది 'మహారాజ' సినిమాతో చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు విజయ్ సేతుపతి. ప్రస్తుతం ఆయన 'ఏస్', 'ట్రైన్' చిత్రాల్లో నటిస్తున్నారు. మిస్కిన్ దర్శకత్వంలో రానున్న 'ట్రైన్'లో శ్రుతిహాసన్, నాజర్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. అరుముగ కుమార్ స్వీయదర్శకత్వంలో 'ఏస్' రూపొందుతోంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఈ చిత్రాన్ని అందరూ చూడండి... 'అనుజా'పై ప్రియాంక పోస్ట్

నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులో ఉన్న అనుజా చిత్రాన్ని అందరూ చూడాలని ప్రియాంక పోస్ట్ పెట్టారు. ఈ సినిమా ఆస్కార్ బరిలో ఉందని మరోసారి గుర్తుచేశారు.

ఈ ఏడాదిలో ఆస్కార్ పోటీల్లో నిలిచి భారత్ ఆశలను సజీవం చేసింది 'అనుజా' లఘు చిత్రం. స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరించిన ఈ చిత్రం ఇటీవల నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. తాజాగా దీనిపై ప్రియాంక పోస్ట్ పెట్టారు. దీనికి అనూహ్యమైన స్పందన వస్తోందన్నారు. ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. అమెరికాలో విడుదలైన ఈ చిత్రానికి అక్కడి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లోనూ దీన్ని ప్రదర్శించగా.. కొన్నింట్లో వివిధ విభాగాల్లో విజేతగా అవార్డులు కూడా దక్కాయి. సామాజిక స్పృహతో రూపొందించిన ఈ చిత్రం ఈ ఏడాది ఆస్కార్ అవార్డులు బరిలోనూ నిలిచింది. తాజాగా ఈవిషయాన్ని మరోసారి గుర్తుచేశారు ప్రియాంక. "ప్రతిష్టాత్మక అవార్డుల బరిలో నిలిచిన ఈ సినిమాను అందరూ చూడాలని నేను సిఫార్సు చేస్తున్నా. ఇది అద్భుతమైన చిత్రం" అని పేర్కొన్నారు.

ఇదీ అనుజా కథ: దిల్లీకి చెందిన అనుజా అనే తొమ్మిదేళ్ల బాలికది కడు పేద కుటుంబం. చదువుకొనే స్థోమత లేక తన అక్కతో కలిసి అక్కడి ఓ దుస్తుల ఫ్యాక్టరీలో పనిచేస్తుంటుంది. అయినా చదువుకోవాలన్న పట్టుదలతో ఉంటుంది. ఈ క్రమంలోనే పాఠశాల, చదువుకు సంబంధించిన పలు ప్రశ్నలు తన అక్కను అడుగుతుంది. ఈ విషయాలు తెలుసుకున్నాక స్కూలుకెళ్లాలన్న ఆసక్తి తనలో మరింత పెరుగుతుంది. అయితే తన కుటుంబ స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థంకాక సతమతమవుతుంటుంది. ఈ క్రమంలోనే అనుకోకుండా అనుజాకు చదువుకొనే అవకాశం వస్తుంది. తదనంతర పరిస్థితులు, అక్కచెల్లెళ్ల మధ్య సరదాగా సాగే సన్నివేశాలను ఆసక్తిగా మలుస్తూ ఈ షార్ట్ఫిల్మ్ తెరకెక్కించారు ప్రముఖ దర్శకుడు ఆడమ్ జె గ్రేవ్స్. ఈ ఏడాది మార్చి 2న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. కోనన్ ఓబ్రియాన్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. గోల్డెన్ గ్లోబ్ అవార్డుల్లో సత్తా చాటిన 'ది బ్రూటలిస్ట్', 'ఎమిలియా పెరెజ్ చిత్రాలు అత్యధిక కేటగిరీల్లో నామినేషన్స్ సొంతం చేసుకున్నాయి. అలాగే ఇండియన్ షార్ట్ ఫిల్మ్ 'అనుజా' ఉత్తమ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) కేటగిరిలో పోటీ పడనుంది.

అందం

ముఖంపై చర్మం సాగి ముడతలు వచ్చాయా, బెంగేలేదు కొన్ని ఫేస్‌ప్యాక్స్ వేస్తే తిరిగి యవ్వనంగా మారుతుంది

వయ-సు పెరిగేకొద్దీ చర్మంపై ముడతలు వచ్చి పెద్దవారిలా కనిపిస్తుంది. స్కిన్ కూడా సాగినట్లుగా ఉంటుంది. అలాకాకుండా ఉండాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.

స్కిన్ సాగినట్లుగా మారి కుంగినట్లుగా అయితే అవి వృద్ధాప్య లక్షణాలే. చర్మం దృఢంగా ఉండేందుకు కొల్లాజెన్ ఉండాల్సిందే. వయసు పెరిగేకొద్దీ హార్మోన్స్ సమస్యల కారణంగా యవ్వనంలో కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీని వల్ల చర్మం వదులుగా మారి కుంగిపోతుంది. దీనికి పరిష్కారంగా మనం ఇంట్లోనే వాడే కొన్ని ఫేస్‌ప్యాక్స్ ఉన్నాయి. వీటిని ఫేస్‌కి అప్లై చేస్తే స్కిన్ యంగ్ అండ్ గ్లోగా ఉంటాయి. మరి ఆ ఫేస్‌ప్యాక్స్ ఏంటో తెలుసుకోండి.



శనగపిండి

శనగపిండి ఫేస్ ప్యాక్ కూడా చర్మానికి చాలా మంచిది. రెండు టీస్పూన్ శనగపిండిలో కొద్దిగా పెరుగు కలిపి ముఖానికి అప్లై చేసి అరగంట తర్వాత క్లీన్ చేయండి. పెరుగు బదులు మీరు పాలు కూడా కలపొచ్చు. దీనిని రాయడం వల్ల కూడా చర్మం టైట్‌గా అందంగా కనిపిస్తుంది.

దోస ప్యాక్

చర్మాన్ని టైట్‌గా మార్చడంలో దోసకాయ ఫేస్‌ప్యాక్ కూడా హెల్ప్ చేస్తుంది. ఇది చర్మాన్ని టైట్‌గా చేస్తుంది. చర్మ రంధ్రాలను తగ్గించి దృఢంగా, యవ్వనంగా చేస్తుంది. దీనికోసం దోసకాయ గుజ్జులో పెరుగు కలపండి. దీనిని ముఖానికి రాయండి. అరగంట తర్వాత క్లీన్ చేయండి. దీంతో చర్మం యవ్వనంగా అందంగా కనిపిస్తుంది. ఇది చర్మానికి ఎన్నో బెనిఫిట్స్‌ని అందిస్తుంది. యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

అరటిపండు

ముఖాన్ని టైట్‌గా చేయడంలో అరటిపండ్లు కూడా ఉన్నాయి. అరటిపండు రాయడం వల్ల స్కిన్ సాఫ్ట్ అండ్ గ్లోగా మెరుస్తుంది. దీనికోసం అరటిపండ్లని గుజ్జులా చేయాలి. దానికి తేనె కలిపి ముఖానికి రాయాలి. తేనెలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. దీని వల్ల చర్మం కాంతివంతంగా, మృదువుగా మారుతుంది. 20 నిమిషాల తర్వాత క్లీన్ చేయాలి. వారానికి రెండు, మూడు సార్లు దీనిని అప్లై చేయడం వల్ల స్కిన్ అందంగా సాఫ్ట్‌గా మారుతుంది.

కలబంద

కలబంద చర్మానికి చాలా మంచిది. మీరు స్వచ్ఛమైన కలబంద జెల్‌ని రాయొచ్చు. అరగంట తర్వాత క్లీన్ చేసుకోండి. అలానే ఉంచినా పర్లేదు. దీనిలో కొద్దిగా తేనె, రోజ్ వాటర్ కలిపి రాయొచ్చు. ఇలా రాయడం వల్ల ముఖంపై మచ్చలు తగ్గడమే కాకుండా చర్మం బిగుతుగా మారుతుంది. మృదువుగా ఉంటుంది. గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.